17

# ఒక మరణం - ఒక చావు

మంత్రిగారి బామ్మగారు మరణించారు. సరిగ్గా రాత్రి తొమ్మిదిన్నరకి యిహలోకయాత్ర చాలించి పరలోకానికి ప్రయాణం కట్టారు. సమయానికి మంత్రిగారు ఊళ్ళోలేరు తమ బామ్మగారికి రోజులు దగ్గరకొచ్చాయని తెలుసుకున్నవారైనప్పటికిన్నీ, ప్రజాసేవయే పరమ ధర్మంగా యెంచుకున్నవారుగనుక ఆ రోజు ఉదయమే ఊరి కెళ్ళారు.

అక్కడికి యాభైమైళ్ళదూరానవున్న ఒకానొక పట్టణంలో, ఆస్పత్రి కట్టాల్సిన స్థలంలో ఆస్పత్రి కట్టనివ్వకుండా, ప్రజలకి యితోధికమైన సేవచేసే సదుద్దేశ్యంతో 'ఎయిర్ కండిషన్డ్ మరియూ బార్ ఎటాచుడ్' హోటల్ నిర్మించాడొక పుణ్యాత్ముడు. ఆ పుణ్యాత్ముడు మరెవరో కాదు, ఒక మంత్రిగారి మేనమామకొడుకే' నంటూంటారు కొందరు పాపాత్ములు. ఆ విషయం మనకప్రస్తుతం. సరే, సదరు హోటేలుకి ప్రారంభోత్సవం చెయ్యవలసిందని, మన మంత్రిగారిని 'కోరిన వెంటనే' 'దయతో అంగీకరించి' అతి

ముఖ్యమైన రాచకార్యాలన్నీ పక్కకునెట్టి, మరణశయ్యమీద నున్న బామ్మగారినికూడ విడిచిపెట్టి పొద్దున్నే బయలుదేరి అక్కడికెళ్లిపోయారు.

మంత్రిగారి బామ్మగారి వయసు తొంభైనాలుగు సంవత్సరాలు. అంత పిన్నవయసులోనే ఆమె అకాలమరణం చెందినందుగ్గాను- మంత్రిగారి బంధుమిత్రులూ అనుచరులూ సహచరులూ యింకా చాలమందీ మంత్రిగారింటికెళ్ళిభోరున ఏడ్చారు. మరికొంతమంది మంత్రిగారొచ్చాక ఏడవొచ్చులే, యిప్పట్నుంచీ ఎందుకు వేస్టనీ, అతికష్టమ్మీద ఏడుపు ఆపుక్కూచున్నారు.

మంత్రిగారికి అరడజను ట్రంక్ కాల్సూ, డజను టెలిగ్రాములూ వెళ్ళాయి పురప్రముఖులు కొందరు కార్లు పంపారు. కొందరు స్వయంగా మంత్రిగారి కెదురెళ్ళారు.

ఇతర మంత్రులయిళ్లకీ, ముఖ్యమంత్రిగారింటికీ, గవర్నర్ గారింటికీ, శాసనసభ్యులయిళ్ళకీ, న్యాయమూర్తుల యిళ్ళకీ, ఉన్నతాధికారుల యిళ్ళకీ, పురప్రముఖుల ఇళ్ళకీ వర్తమానాలు వెళ్ళాయి అంతా హడావిడిగా బయల్దేరి వచ్చేశారు. కొందరు పెద్దలు మటుకు మంత్రిగారొచ్చాక కబురుచెయ్యమన్నారు జనం విపరీతంగా వచ్చారు. పత్రికా విలేఖరులొచ్చారు. ఫొటోగ్రాఫర్లొచ్చారు. పోలీసు వాళ్ళొచ్చారు. సినిమా స్టార్లొచ్చారు. మంత్రిగారి యిల్లు కిటకిటలాడిపోయింది.

కొందరు - కాలుగాలిన పిల్లులా, నిప్పుతొక్కిన కోతుల్లా యింట్లోంచి బయటికీ బయటినుంచి యింట్లోకీ పరుగులెత్తుతున్నారు. ఒక్కరొక్కరుగా విచ్చేస్తున్న పెద్దలకి స్వాగతాలు చెప్పి లోపలికి తీసుకెళ్తున్నారు. కొందరు - వచ్చిన పెద్దలచుట్టూ చేరుతున్నారు మరికొందరు మంత్రిగారి బామ్మగారి జీవిత విశేషాలు చెప్పమని విచారిస్తున్నారు కొందరు శవానికి సేవలు చేస్తున్నారు. ఈగలూ దోమలూ రాకుండా విసనకర్రలు పుచ్చుకు విసురుతున్నారు. కంపుకొట్టకుండా పన్నీరు చల్లుతున్నారు. అగరువత్తులు వెలిగిస్తున్నారు. కొందరు మంత్రిగారి సతీమణికీ, పిల్లలకీ విసురుతున్నారు. ఫాన్ గాలికి ఉక్కిరి బిక్కిరై పోతారని విసనకర్రలు పుచ్చుకుని అతిజాగ్రత్తగా అతిమెల్లగా విసురుతున్నారు కొందరు కళ్ళుతుడుచుకుంటున్నారు; కొందరు ముక్కులు చీదుతున్నారు. ఓదార్పుదామంటే మంత్రిగారి సతీమణిగాని, పిల్లలుగాని ఏడవడంలేదు. తలోకుర్చీలోనూ సీరియస్‌గా కూర్చున్నారు.

అర్ధరాత్రి పన్నెండున్నరకి-ముందు నాలుగుకార్లూ వెనక నాలుగుకార్లూ తోడురాగా- మధ్యనున్న కారులో మంత్రిగారు విచ్చేశారు. కారుతలుపు స్వంతచేతుల్తో తెరిచే సౌభాగ్యంకోసమూ, మంత్రిగారికి మొట్టమొదట సానుభూతి తెలియచెయ్యే మహదవకాశంకోసమూ, మంత్రిగారు లేకపోయినా ఏలోటూ లేకుండా తామేటువంటి ఏర్పాట్లు

చేశారో విన్నవించుకోవడంకోసమూ- చాలమంది కారుమీదికెగబడ్డారు. లోపలున్నవాళ్ళు కూడ పరుగెత్తుకొచ్చి కారు చుట్టూమూగారు. పోలీసులు జోక్యంకలుగజేసుకుంటేగాని మంత్రిగారు లోపలికెళ్ళడానికి వీలై దికాదు

మంత్రిగారు ఇంట్లోకిరాగానే చాలమంది ఏడవటం మొదలెట్టారు. మంత్రిగారు మౌనంగావెళ్ళి బామ్మగారి శవంపక్కన కూచున్నారు. ఉలకలేదు; పలకలేదు; పరమ సీరియస్‌గా శవాన్నిచూస్తూ కూచున్నారు. ఆయినా ఏడవకపోయేసరికి ఓదార్చుదామని కూర్చున్నవాళ్ళకి మరోసారి ఆశాభంగం కలిగింది.

పెద్దలొక్కరొక్కరూ మంత్రిగారిదగ్గరకొచ్చి తమ తీవ్రసంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని వ్యక్తపర్చి శెలవు తీసుకు వెళ్ళిపోయారు. ఆ తర్వాత మంత్రిగారు తమ ఆంతరంగికులైనవారితో కొద్దిసేపు ముచ్చటించి, రేపటి అంత్యక్రియల ఏర్పాట్లగురించి ఆదేశాలిచ్చి, మేడమీదికెళ్ళిపోయారు.

సరిగ్గా అదేసమయాన-మంత్రిగారింటికి రెండుఫర్లాంగులదూరాన-ఒకగుడిసెలో-

కిరసనాయిల్ దీపం గుడ్డివెలుగులో- దిక్కూ- మొక్కూ, డబ్బూ దస్కం ఏమీలేని అభాగ్యుడొకడు- అనామకుడొకడు పాతికేళ్ళ భార్యశవాన్ని ముందెట్టుకు కూచున్నాడు.

అతని భార్యకి తిండిలేక రోగమొచ్చింది. డబ్బులేక చచ్చిపోయింది.

వారంరోజులు నరకయాతన లనుభవించి అంతికి గంటక్రితమే కన్నుమూసింది.

ఏం చెయ్యాలో అతగాడికేం తోచడంలేదు. కాళ్లూ చేతులూ ఆడ్డంలేదు. బంధువుల్లేరు; స్నేహితుల్లేరు:శవాన్ని తగలెయ్యటానికూడా డబ్బుల్లేవు; కళ్ళనిండా నీళ్లుమాత్రమున్నాయి చొక్కానిండా, గుండెనిండా చిరుగులుమాత్రమున్నాయి.

అతని పేరూ ఊరూ అనవసరం ! మహామహా మంత్రిగారిపేరే మనం చెప్పుకోవటంలేదే- ఆ అనామకుడి పేరెందుకు ? అనామకుడనే అందాం.

○ ○ ○

తెల్లవారింది.

మంత్రిగారింట్లో మంత్రిగారూ ఆయన భార్యా పిల్లలూ ఏమోగాని- మంత్రిగారి భక్తభంధుజనం మటుకు తెల్లవార్లూ శవజాగరణ చేశారు పాపం. మంత్రిగారి బామ్మగారి ఆకస్మిక మరణవార్తవిని ఆకాశవాణివారు చింతిస్తూ ప్రకటించారు. వార్తాపత్రికల్లో మొదటిపేజీల్లో ప్రముఖంగా ప్రచురించారు.

మంత్రిగారి బామ్మగారి ఫోటోదొరక్క-- ఒక పత్రిక

వారు మంత్రిగారి ఫోటోనే వేసేసి- 'ఫలానా మంత్రి గారిపై పిడుగుపాటు- దేశానికి తీరనిలోటు' - అని శీర్షిక పెట్టారు. మరోపత్రికా సంపాదకుడు- 'ఫలానా మంత్రిగారి పితామహి మరణం' అని శీర్షికపెట్టి ప్రెస్సుకి పంపితే - ప్రెస్సులో అక్షరాలుకూర్చే ఆయనకి ఆవేశమొచ్చి అందులో యింకో అక్షరంకూడా చేర్చేశాడు. చివరికి - "ఫలానా మంత్రిగారి పితామహిషి మరణం" - అని అచ్చయింది. ఆ పత్రికవారిమీద మంత్రిగారు ఆగ్రహించడం వేరేకథ.

ఉదయం తొమ్మిదిగంటలకి బ్రహ్మాండమైన ఊరేగింపుతో శవయాత్ర ప్రారంభమైంది ఒకలారీలో పెద్ద వేదిక సమర్చి దానిమీద శవాన్ని పడుకోపెట్టారు పక్కనే మంత్రిగారు నిలబడ్డారు. మంత్రిగారి భార్యా బిడ్డలూ, యితర పెద్దలూ లారీకిముందూ వెనకా కార్లలో కూర్చున్నారు.

ఇంకా కార్లూ, మోటార్సైకిళ్ళూ, సైకిళ్ళూ, రిక్షాలూ చాలాచేరాయి మంత్రిగారి యింటికి శ్మశానం అరమైలు దూరముంటే, యివన్నీకలిసి మైలుపొడవయ్యాయి.

దారిపొడుగునా- చాలమంది ప్రముఖులూ వ్యాపార సంస్థలవారూ, దుకాణాలవారూ బామ్మగారి "పార్థివ కాయం" మీద పూలమాలలుంచి, శవానికీ మంత్రిగారికీ కూడ నమస్కారాలు చేసి తమతమ భక్తిప్రపత్తులు వెల్లడించు

కున్నారు. శ్మశానానికి చేరేటప్పటికి పదకొండైంది. అప్పటికే అక్కడ ఒక పెద్ద చితి అందంగా పేర్చివుంచారు. పైన రెండారసలు గంధపుచెక్కలు కూడా పేర్చారు. కలప వ్యాపారస్తుల సంఘంవారు ఒక లారీనిండా మాంచి ఎండు కట్టెలు పంపారు. నూనెవర్తకుల సంఘంవారు నేతిడబ్బాలు పంపారు.

మంత్రిగారితో పాటు యితర పెద్దలుకూడా కార్లు దిగి చితివరకూ నడిచారు. మిగతాజనాన్ని కాస్త ఎడంగానే పోలీసులాపేశారు. దహనకాండ ప్రారంభమయ్యే ముందు- మంత్రిగారి కుడిభుజ మొకాయన కాస్సేపు ఉపన్యసించాడు. బామ్మగారి గుణగణాల్ని ప్రశంసించి, ఆవిడ మరణం రాష్ట్రానికే కాక, యావద్భారత దేశానికీ, మళ్ళీ మాట్లాడితే యావ ప్రపంచానికీ ఎంతనష్టమో వివరించాడు.

తనకీ అవకాశం కలిగించినందుకు బామ్మగారికి కృతజ్ఞతలు చెప్పుకుని ఉపన్యాసం విరమించాడు. మంత్రిగారి యెడంభుజంకూడ మాట్లాడామనుకున్నాడుగాని మంత్రిగారే వద్దని వారించారు.

బామ్మగారి మరణానికి దేవతలు కన్నీరు కారుస్తున్నట్టుగా - సన్నగా చినుకు ప్రారంభమైంది. చితిమీద శవాన్ని పడుకోబెట్టారు జరగవలసిన తతంగమంతా జరిగాక, చితిమీద నెయ్యి కుమ్మరించి, నిప్పంటించారు మంత్రిగారు భగ్గున, నిలువెత్తున మంటలు లేచాయి.

సరిగ్గా అదే సమయాన - అదే శ్మశానంలో మరో మూల - ఆ పుల్లా ఈపుల్లా ఏరుకుని, చెత్తా చెదారం పోగు చేసి, భార్యశవాన్ని దహనం చెయ్యడానికి నానాతిప్పలూ పడుతున్నాడు అనామకుడు.

చివరకు కాస్త పెద్దదైంది అంటుకున్న నిప్పు ఆరి పోయింది. ఇంకేం చెయ్యాలేక చతికిలబడ్డాడు అనామకుడు, వాళ్ళదగ్గిరా వీళ్ళదగ్గిరా అడుక్కున్న పైసలు కాటిసుంకానికే సరిపోయాయి. కట్టెలు కొనడానికి మిగల్లేదు.

తలెత్తి నల్దిక్కులా చూశాడు. ఆమూల - మంత్రి గారి బామ్మగారి చితి ఇంకా దివిటీ వెలిగినట్టు వెలుగుతూనే వుంది.

ఉన్నట్టుండి ఆకాశంలో నలువైపులా కారుమబ్బులు కమ్ముకొచ్చాయి మంత్రిగారి బామ్మగారి అంత్యక్రియలు చూడ్డానికొచ్చిన జనమంతా వెళ్ళిపోయారు. బామ్మగారి భౌతికకాయం దాదాపు బూడిదైంది బూడిదయ్యేదాకా వుంటామన్న వాళ్ళిద్దరూ, కాస్త వెచ్చగా ఏదైనా తాగి వద్దామని ఎక్కడికో వెళ్ళారు, శ్మశానంలో ఒక్కపురుగు మిగల్లేదు అనామకుడు తప్ప.

అంతా వెళ్ళిపోయాక అనామకుడు మెల్లగా లేచి - భార్యశవం భుజాన వేసుకుని. బామ్మగారి చితిదగ్గరకొచ్చాడు శవాన్ని కిందదింపాడు. ఒక్కనిమిషం ఆలోచించాడు. ఆలోచించే వ్యవధిలేదు. పెద్దవర్షం వచ్చేట్టుగా వుంది వేరే చితి

తయారుచేసి అంటించాలంటే కష్టం. ఈలోగా యెవరైనా రానచ్చు అందుకే వెంటనే తన కర్తవ్యం నిర్ణయించు కున్నాడు.

విడిగా పడివున్న కట్టెలు కొన్నితీసి చితిలో వేశాడు భార్యశవాన్ని చితిమీదవుంచి మరికొన్ని కట్టెలు వేశాడు. మంటలు మళ్ళీ నిలువెత్తున లేచాయ్!

○ ○ ○

కొద్దిరోజులతర్వాత-మంత్రిగారి బామ్మగారి చితా భస్మాన్ని నగరానికి సమీపాన వున్న నదిలో కలపడంకోసం-పెద్దయెత్తున ఏర్పాటైన కార్యక్రమంలో, అనామకుడు కూడ ఆనందంగా పాల్గొన్నాడు.

---